అద్దె భవనాల్లో అవస్థలు

- మాడుగులపల్లిలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు కరువు
- అరకొర వసతుల నడుమ విధుల నిర్వహణ
- ఏడేళ్లు దాటినా నిర్మాణంపై దృష్టిపెట్టని ప్రభుత్వం

మాడుగులపల్లి: పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2016లో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మాడుగులపల్లి మండలంగా ఆవిర్భవించింది. మూడు నియోజకవర్గాల్లోని 20 గ్రామ పంచాయతీలను వేరు చేసి ఈ మండలానికి తుది రూపునిచ్చారు. చిన్నగ్రామాలను సైతం పంచాయతీలుగా గుర్తించడంతో ఈ సంఖ్య 28కి చేరింది. మండలం ఏర్పాటై ఏడేళ్లు గడిచినా పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అరకొర వసతుల నడుమ అధికారులు, సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. ఫైల్స్, కంప్యూటర్లు పెట్టుకునేందుకు, కూర్చునేందుకు కార్యాలయాల్లో సరైన స్థలం లేక ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు.

జనం కూర్చునేందుకు స్థలం లేక..

మండల కేంద్రంలోని ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ భవనం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గతంలో ఉన్న పశువైద్యశాల భవనంలో కొన్ని గదులను తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించారు. ఈ కార్యాలయాలకు నిత్యం పనుల నిమిత్తం వచ్చే జనాలు కూర్చునేందుకు కనీస స్థలం లేక అవస్థలు పడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ సమావేశం, ఇతర సదస్సుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తున్నాయి. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

లేదు. ఇటీవల జరిగిన కేబినేట్ సమావేశంలో 40 కొత్త మండలాలకు పీహెచ్‌సీలను కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి సైతం స్థలాన్ని కేటాయించినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

వేలల్లో అద్దె..

అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రతి నెలా రూ.18 వేలకుపైగా అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ఏడాదికి రూ.2 లక్షల 20 వేలు అద్దె రూపంలో ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోంది. ఈ లెక్కన ఈ ఏడేళ్లలో రూ.20 లక్షలు అద్దె రూపంలో చెల్లించారు. ఈ నిధులతో వీటిలో ఏదో ఒక భవనం పూర్తయ్యేది. కానీ పాలకులు, అధికారులు ఇటుగా దృష్టి పెట్టకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోంది.

ఇటీవలే స్థలం గుర్తింపు..

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణంపై ఇటీవలే ప్రభుత్వం దృష్టిసారించింది. రెండు నెలల క్రితం నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చి కార్యాలయాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న మానవ వనరుల కేంద్రం భవనంలోకి మార్చాలని సూచించారు. బాపనికుంట సమీపంలోని 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, కేజీబీవీ భవనాల నిర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిసింది.

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె గదుల్లో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేక నిధులు లేకపోవడంతో అద్దె చెల్లింపులకు ఆర్థిక వెసలుబాటు ఉండడం లేదు. సాధ్యమైనంత త్వరగా భవనాలు నిర్మించాలి.

– పోకల శ్రీవిద్య, ఎంపీపీ, మాడుగులపల్లి

భవనాలపై దృష్టి పెట్టడం లేదు



మండల కేంద్రం ఏర్పాటైనా ఏ ప్రభుత్వ కార్యాలయానికి పక్కా భవనం లేదు. తాత్కాలిక అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కార్యాలయాలు విశాలంగా లేకపోవడంతో పనుల నిమిత్తం వచ్చే జనం కూర్చునేందుకు కూడా సరైన స్థలం లేదు.

– పుల్లెంల సైదులు, జెడ్పీటీసీ, మాడుగులపల్లి

మంత్రుల పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి రానున్నారు. ఈమేరకు గురువారం వేములపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని, ఎస్ఎస్‌పీ క్యాంపులో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి,, ఏఎంసీ మాజీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, జేపీసీ చైర్మన్ ధర్మపాల్‌రెడ్డి ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో మొదటి బహుమతి సాధించిన కబడ్డీ క్రీడాకారులను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో మిర్యాలగూడ కబడ్డీ జట్టు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి సాధించారని, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించి నల్లగొండ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల కోరిక మేరకు ఇండోర్ స్టేడియంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన కబడ్డీ కోర్టును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ నూకల సరళహన్మంతరెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులతోపాటు రూ.5వేల నగదు అందజేశారు. అదేవిధంగా ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి క్రీడాకారులకు రూ.3వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, పీఈటీలు వెంకటరత్నం, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

కూరగాయల సాగులో మెళకువలు పాటించాలి



కంపాసాగర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు

త్రిపురారం: కూరగాయల పంటల సాగులో రైతులు మెళకువలు పాటిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యారాణి అన్నారు. త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో నాబార్డు సౌజన్యంతో జిల్లాలోని రైతులకు కూరగాయల సాగు, మార్కెట్‌లో అధునాతన పద్ధతులపై గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన కూరగాయలను పండిస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. విత్తుకోవాల్సిన సమయం, అంతర కృషి, కీపర్ మెష్‌పై తీగజాతి కూరగాయల సాగు, ట్రైకోడర్మావిరిడి మిశ్రమం, ప్రొ ట్రేలలో కూరగాయల నారు పెంపకం, వర్మీకంపోస్టు తయారీ, డ్రిప్ ఇరిగేషన్, ఫర్టిగేషన్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ, పల్లవి, సాయి కిరణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దేవేందర్

దేవరకొండ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్ కోరారు. మే 25న బీఆర్ అంబేద్కర్ డిగ్రీ పట్టా పొందిన రోజును పురస్కరించుకొని గురువారం ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, పొట్ట మురళి, పొట్ట సుగుణయ్య, ఎర్ర ఆంజనేయులు, అంకూరి దానయ్య, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాతంగి శ్రీను, నల్ల శేఖర్ తదితరులున్నారు.

సిరిమాను ఊరేగింపు



సిరిమాను ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లిలో గురువారం శ్రీమహిషాసురమర్దిని అమ్మవారి జాతరలో భాగంగా గురువారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం నుంచి గ్రామ శివారు వరకు సిరి మాను ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

చెరువులు, కుంటలను నింపాలి

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



చందంపేట గేట్ వద్ద కాల్వ ద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట: చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలను త్వరితగతిన నింపాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధికారులకు సూచించారు. డిండి ప్రాజెక్టు నుంచి చందంపేట మండలంలోని బండమీదితండా వద్ద బడెసాయబ్ కుంటకు, చందంపేట గేట్ వద్ద కాల్వల ద్వారా వస్తున్న నీటిని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా తాగు, సాగు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఆయన వెంట రైతుబంధు అధ్యక్షుడు బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు యాసాని రాజవర్ధన్‌రెడ్డి, రమావత్ మోహన్‌కృష్ణ, గోసుల అనంతగిరి, బొడ్డికూర మహాలక్ష్మయ్య, కొర్ర రమేశ్, బొడ్డుపల్లి కృష్ణ, నాగిళ్ల మహేశ్, శోభన్, సైదులు, భయ్య మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంస్కృతికి ప్రతిబింబం బొడ్రాయి పండుగ

చందంపేట: గ్రామ సంస్కృతికి బొడ్రాయి పండుగ ప్రతిబింబమని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం చందంపేట మండలంలోని కోరుట్ల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, నాయకులు యాసాని రాజవర్ధన్‌రెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, రమావత్ మోహన్‌కృష్ణ, గోసుల అనంతగిరి, బొడ్డికూర మహాలక్ష్మయ్య, బొల్లు రామకృష్ణ, కొర్ర రమేశ్, గన్నెబోయిన మల్లేశ్‌యాదవ్, విఠల్‌రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, శోభన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతుల్లో వేగం పెంచాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ గోపీరాం

డిండి: కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన వరిధాన్యం దిగుమతిలో వేగం పెంచాలని దేవరకొండ ఆర్డీఓ గోపీరాం మిల్లర్లకు సూచించారు. గురువారం మండల పరిధిలోని చెర్కుపల్లి, టి.గౌరారం, కామేపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం, రావాల్సిన ధాన్యం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. లారీల కొరత కారణంగానే కొనుగోలు ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. లారీల సంఖ్యను పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడటంతోపాటు ట్రాక్టర్‌లు, డీసీఎంలలో ధ్యాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఇప్పటికే కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌కు సూచించినట్లు చెప్పారు. అనంతరం మండలంలోని చెర్కుపల్లిలో ఉన్న శ్రీసాయిలక్ష్మీ రైస్ మిల్లులో దిగుమతి అవుతున్న ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామ్ నాయక్, సీఈఓ బాల్‌రెడ్డి ఉన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ధర్నా



మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో నెలకొన్న నీటి ఎద్దడిని పరిష్కరించాలని గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు పట్టణంలోని నాల్గో వార్డు ఈదులగూడెం ఏనేమీద నుంచి కాలనీవాసులు మున్సిపాలిటీ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఈదులగూడెం ఏనేమీద సుమారు 350 కుటుంబాలు నివసిస్తున్నాయని, గత పది రోజులుగా నీరందక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నప్పటికీ పాలకమండలి, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీలో అక్కడక్కడ మిషన్ భగీరథ పైపులైన్లు వేయకుండా వదిలివేశారని, దీంతో నీరందక ప్రజలు ట్యాంకుల వద్దకు వెళ్లాల్సి వస్తుందన్నారు. నీటి ఎద్దడిని పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్‌చంద్రారెడ్డి, రవినాయక్, గౌతమ్‌రెడ్డి, పరశురాములు, పాండు, మంగారెడ్డి తదితరులున్నారు.

పర్యటనను అడ్డుకోవాలి

మిర్యాలగూడ: మిర్యాలగూడలో జరిగే మంత్రుల పర్యటనను అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017లో మంత్రులు పర్యటించి శంకుస్థాపనలు చేశారని, కానీ ఇప్పటివరకూ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. తిరిగి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పేరుతో మోసం చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామలింగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, నాయకులు సిద్దునాయక్, ఎండీ గౌస్, గుంజ శ్రీను, రాథోడ్ అశోక్ పాల్గొన్నారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లి..

- గుండెపోటుతో తక్కెళ్లపాడు వాసి మృతి



రాములు(ఫైల్)

మిర్యాలగూడ టౌన్: చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన తక్కెళ్లపాడు గ్రామ వాసి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల ప్రకారం .. మిర్యాలగూడ మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చౌగాని జీడికళ్ల రాములు(58) తన 30 మంది స్నేహితులతో కలిసి ఈనెల 5న మిర్యాలగూడ నుంచి చార్‌ధామ్ యాత్ర కోసం ఉత్తరాఖండ్‌కు వెళ్లారు. కేదార్‌నాథ్ దర్శనానికి అతిపెద్ద శిఖరం ఎక్కుతుండగా మంచుకు శ్వాస ఆడకపోవడంతో మార్గమధ్యంలో రాములుకు ఛాతీలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి స్నేహితులు వెంటనే అతడిని సమీపంలో గల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుద్రప్రయాగ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం శుక్రవారం మధ్యాహ్నం వరకు అయ్యే అవకాశం ఉందని బంధువులు తెలిపారు. కాగా.. రాములు మృతదేహం శుక్రవారం రాత్రి తక్కెళ్లపాడుకు వచ్చే అవకాశాలున్నాయి.

గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ

మాడుగులపల్లి: సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా బాధ్యుడు బాణాల రామలింగారెడ్డి కోరారు. గురువారం ఆయన మాడుగులపల్లి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీకి పన్నుల ద్వారా వస్తున్న ఆదాయం, రాష్ట్ర, కేంద్ర నిధుల వివరాలు తెలుసుకునేందుకు ఆర్టీఐ కింద దరఖాస్తు రాగా.. పరిశీలనకు కార్యదర్శి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

బత్తాయి చెట్లు దగ్ధం

త్రిపురారం: బత్తాయి తోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని 200 బత్తాయి చెట్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కంపాలపల్లి గ్రామ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కంపాలపల్లి గ్రామ పరిధిలో బొబ్బిలి సైదులు, బొబ్బిలి వెంకన్న 6 ఎకరాల్లో బత్తాయి తోటను సాగు చేస్తున్నారు. ప్రమాదవశాత్తు ఈ తోటకు గురువారం నిప్పంటుకోవడంతో తోటలో ఉన్న 200 వందల బత్తాయి చెట్లు, డ్రిప్ పైపులు, స్ప్రింకర్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. తోటకు సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే నిప్పు రవ్వలు పడి వరి గడ్డికి నిప్పంటుకొని ఆ మంటలు బత్తాయి తోట వరకు చేరుకున్నాయని బాధిత రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పారు. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పెద్దఅడిశర్లపల్లి: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఏవీరెడ్డి అన్నారు. గురువారం పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో మాదాపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రమావత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా ముడావత్ కిషన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లయ్య, బోడ్యానాయక్, ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, నారాయణ, సతీష్, ఆమటి శివ, రమేష్‌నాయక్ తదితరులున్నారు.

చెరువు శిఖం ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ఇరిగేషన్ డీఈ జనార్దన్



పందిళ్లపల్లిలో ఆక్రమణకు గురైన చెరువు శిఖాన్ని పరిశీలిస్తున్న ఐబీ డీఈ జనార్దన్

మిర్యాలగూడ: బఫర్ జోన్, చెరువు శిఖం, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ సబ్ డివిజన్ ఇంజనీర్ జనార్దన్ హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలోని తాళ్లగడ్డ పందిళ్లపల్లి చెరువును ఆయన సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పందిళ్లపల్లి చెరువు ఆక్రమణకు గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చెరువు శిఖాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బఫర్ జోన్, చెరువు శిఖం, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం చట్ట వ్యతిరేకమన్నారు. గతంలో చెరువు శిఖంలో బఫర్ జోన్ 30 మీటర్లు, చెరువు బఫర్ జోన్ 9మీటర్లు గతంలో ఆక్రమించుకున్న వారిపై కేసులు నమోదు చేశామని గుర్తు చేశారు. తాజాగా జరిగిన ఆక్రమణలను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు గురువారం మున్సిపల్ అధికారులతో కలిసి మున్సిపల్ పబ్లిక్ అండ్ హెల్త్ డీఈ మనోహర్ ఎకరం 34 గుంటల స్థలంలో మార్క్ అవుట్ చేశారు. సుమారు రూ.4కోట్ల 50లక్షలతో మార్కెట్ నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పబ్లిక్ అండ్ హెల్త్ డీఈ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఏఈ రాజు తదితరులున్నారు. ఇదిలా ఉండగా.. కళాశాల స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని, వెంటనే మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పలుమార్లు అధికారులకు నివేదించారు.

కళాశాల ఆవరణలో మార్కెట్ ఏర్పాటు చేయొద్దు

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని అధికారులు ఉపసంహరించుకోవాలని బహుజన సమాజ్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర కృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు.

వృక్షశాస్త్ర అధ్యాపకుడికి డాక్టరేట్



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న శంకర్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లిలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న శిరసనగండ్ల శంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వృక్షశాస్త్ర విభాగంలో గురువారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'నల్లమల అడవుల్లో వృక్షాల జీవిత చక్రం' అంశంపై పరిశోధనలు చేసినందుకుగాను గౌరవ డాక్టరేట్ పట్టా అందించారని ఆయన తెలిపారు.

వడదెబ్బతో ఒకరు మృతి

చింతపల్లి : వడ దెబ్బతో ఇటుకబట్టీ కూలీ మృతి చెందాడు. చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సమీపంలో ఇటుక బట్టీలో ఒడిషా రాష్ట్రంలోని రాజ్‌కడియాల్ ప్రాంతానికి చెందిన ప్రేమ్‌లాల్ బోయి (35) కుటుంబ సభ్యులతో కలిసి పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ప్రేమ్‌లాల్ బోయి అస్వస్థతకు గురికావడంతో భార్య మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. బుధవారం దేవరకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య అసిత బోయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆదిమల్ల శంకర్

దేవరకొండ: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్ పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము, డిండి, పెద్దఅడిశర్లపల్లి మండలాలకు సంబంధించి ఎస్సీ సెల్ అధ్యక్షులను నియమిస్తూ వారికి దేవరకొండలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకూరి శివ, మల్లేష్, దయాకర్, ఉపేందర్, సుమన్ తదితరులున్నారు.

ప్రశంసాపత్రం అందజేత



గుణాకర్‌ను అభినందిస్తున్న విజయసింహారెడ్డి

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 24న నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో మిర్యాలగూడ పట్టణానికి చెందిన గుణాకర్ బంగారు పతకం సాధించి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు గురువారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గుణాకర్‌ను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టిబాబునాయక్‌లు అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం కోచ్ రవీందర్‌ను అభినందించారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి

దేవరకొండ: ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం దేవరకొండలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్, బుడిగ వెంకటేష్, సైదులు, కళ్యాణ్ తదితరులున్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

మిర్యాలగూడ అర్బన్: స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జప్తు చేయబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను శుక్రవారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్‌పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనేవారు ఉదయం 11గంటలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మిర్యాలగూడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి జేపీఎస్‌లు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావును శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత

హాలియా: అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కప్పెర కోటేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ కొత్తపల్లి గ్రామ శాఖ నాయకులు పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

క్రీడాదుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

నాగార్జునసాగర్: స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన 24మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పీఏఓ సూపరింటెండెంట్ మర్రిపూడి శ్రీనివాసరావు వారికి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన వెంట పాఠశాల పీఈటీ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు హనుమకుమార్, మిట్టపల్లి శ్రీనివాస్, మోహన్‌నాయక్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే కిశోర్ వ్యాఖ్యలు సరికాదు

నిడమనూరు: దళితబంధు విషయంలో ఎంఆర్‌పీఎస్ నాయకులపై ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించిన దళిత న్యాయవాదిని ఎమ్మెల్యే అనుచరులు దూషించారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.